వీసా లేకుండా రష్యా ప్రయాణం

త్వరలో అందుబాటులోకి

మాస్కో, అక్టోబర్ 28: భారతీయ పర్యాటకులను ఆకర్షించేందుకు రష్యా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. అందులో భాగంగా వీసా నిబంధనలను సడలించడంపై ఈ ఏడాది జూన్‌లో భారత్‌తో చర్చలు జరిపింది. ఇందుకు సంబంధించిన ద్వైపాక్షిక ఒప్పందం పురోగమన దశలో ఉన్నదని, దీంతో వచ్చే ఏడాది స్ప్రింగ్ సీజన్ (వసంత కాలం) నాటికి భారతీయులకు వీసా రహిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి రావొచ్చని మాస్కో సిటీ టూరిజం కమిటీ చైర్మన్ యెవ్‌గెనీ కొజ్లోవ్ వెల్లడించినట్టు 'ఎకనమిక్ టైమ్స్' పత్రిక పేర్కొన్నది. రష్యా వెళ్లే భారతీయులకు నిరుడు ఆగస్టు 1 నుంచి ఈ-వీసాలు లభిస్తున్నాయి. వీటి జారీకి 4 రోజుల సమయం పడుతున్నది.

జమ్ములో ఆర్మీ కాన్వాయ్‌పై ఉగ్రదాడి

ముష్కరుల్లో ఒకరు హతం

న్యూఢిల్లీ: భారత్‌లోకి చొరబడేందుకు ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాలను భద్రతా బలగాలు వమ్ము చేశాయి. సోమవారం తెల్లవారుజామున జమ్ము అఖ్నూర్ సెక్టార్‌లో ఉగ్రవాదులు ఆర్మీ కాన్వాయ్‌పై దాడికి తెగబడ్డారు. వాహనశ్రేణిలోని అంబులెన్స్‌ను టార్గెట్ చేశారు. భద్రతా బలగాలు జరిపిన ఎదురు కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. 'మరో ఇద్దరు ఉగ్రవాదులు దట్టమైన అటవీ ప్రాంతంలోకి పారిపోయారు. జమ్ము నగరానికి 85 కిలోమీటర్ల దూరంలో అ ఖ్నూర్ సెక్టార్‌లోని బట్టాల్ ప్రాం తంలో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.

రష్యాకు 10 వేల మంది ఉత్తర కొరియా సైనికులు

అమెరికా ఆందోళన

బ్రసెల్స్: రష్యాకు ఉత్తర కొరియా 10,000 మంది సైనికులను పంపించిందని అమెరికాలోని పెంటగాన్ అధికార ప్రతినిధి సబ్రిన సింగ్ సోమవారం చెప్పారు. రష్యాలోని కుర్స్క్ రీజియన్‌లో ఉక్రెయిన్ దళాలపై జరుగుతున్న యుద్ధంలో నేరుగా కానీ, సహాయకారులుగా కానీ వీరిని రష్యా వినియోగించుకునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సైనిక శిక్షణ ఇవ్వడానికి కూడా వీరిలో కొందరిని ఉపయోగించే అవకాశం ఉందన్నారు. కొందరు సైనికులు ఇప్పటికే ఉక్రెయిన్ సమీపానికి చేరుకున్నారని చెప్పారు. ఉత్తర కొరియా సైనికులను యుద్ధంలో ఉపయోగించుకోవడం అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకమని తాము ఇప్పటికే బహిరంగంగా హెచ్చరించామన్నారు.

మళ్లీ బ్యాలెట్ పేపర్ తీసుకురావాలి: ట్రంప్

న్యూయార్క్: ఎన్నికలు నిజాయితీగా జరగాలంటే.. అది పేపర్ బ్యాలెట్‌తోనే సాధ్యమవుతుందని, పేపర్ బ్యాలెట్‌ను తిరిగి తీసుకురావాలని రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. 2020 అధ్యక్ష ఎన్నికలు మోసపూరితమైనవిగా పేర్కొన్నారు. దాదాపు మూడు గంటలపాటు సాగిన ఓ ఇంటర్వ్యూలో ఆయన వివిధ అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత ఓటింగ్ విధానాన్ని ట్రంప్ విమర్శించారు. పేపర్ బ్యాలెట్ తీసుకురాకపోతే, ఎన్నికల్లో నిజాయితీని నిర్ధారించలేమన్నారు. 2024 ఎన్నికలు.. తనకు చివరి ఎన్నికలుగా పేర్కొన్నారు.

ఇంజినీరింగ్‌తో కొలువు కష్టమే!

జాబ్ గ్యారెంటీ ఇవ్వని టెక్ కోర్సులు

- 10 శాతం పట్టభద్రులకే ఉద్యోగాలు
- ఐఐటీయన్లకూ దక్కని కొలువులు
- కొత్త సాంకేతికతలపై లేని నైపుణ్యాలు
- టీమ్ లీజ్ సంస్థ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 28: ఇంజినీరింగ్ చదివితే జాబ్ గ్యారెంటీ.. భవిష్యత్తు భద్రంగా ఉంటుందనేది మన దేశంలో చాలామంది తల్లిదండ్రులు, విద్యార్థుల నమ్మకం. అందుకే గత కొన్ని దశాబ్దాలుగా దేశంలో ఏ కోర్సుకూ లేనంత డిమాండ్ ఇంజినీరింగ్‌కు పెరుగుతున్నది. డిమాండ్‌కు తగ్గట్టుగానే వేల సంఖ్యలో కళాశాలలు సైతం వెలిశాయి. దేశంలో పారిశ్రామీకరణతో ఇంజినీరింగ్ విద్యకు మొదలైన డిమాండ్ 1990లలో ఐటీ విప్లవంతో గణనీయంగా పెరిగింది. గత 10 – 15 ఏండ్లుగా దేశంలోని మెజారిటీ విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యను ఏకైక మార్గంగా భావించడం ప్రారంభమైంది. అయితే, ఇటీవలి కాలంలో పరిస్థితులు మారిపోతున్నాయి. ఒకనాడు జాబ్ గ్యారెంటీ అనే భరోసా ఇచ్చిన బీటెక్ కోర్సులు ఇప్పుడు ఔటేడేటెడ్‌గా మారుతున్నాయి. ఇంజినీరింగ్ చేసినా ఉద్యోగం సంపాదించడం కష్టంగా మారుతున్నది. ఇందుకు సంబంధించి 'టీమ్ లీజ్ డిగ్రీ అప్రెంటీస్‌షిప్' చేసిన అధ్యయనంలో కీలక విషయాలు వెల్లడయ్యాయి.

ఉద్యోగం దక్కేది 10 శాతం మందికే

దేశంలో ఈ ఏడాది 15 లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తి చేయబోతున్నారని, వీరిలో 10 – 15 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని 'టీమ్ లీజ్' నివేదిక అంచనా వేసింది. ఇంజినీరింగ్ పూర్తి చేసేవారిలో దాదాపుగా 60 శాతం మంది ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తారని, కానీ వీరిలో పరిశ్రమ అంచనాలకు తగ్గట్టుగా ఉండేది మాత్రం కేవలం 45 శాతం మందేనని టీమ్ లీజ్ సీఈఓ ఏఆర్ రమేశ్ తెలిపారు. ఐఐటీల్లో చదివిన వారికి కూడా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారుతున్నది. 2024లో పట్టభద్రులైన ఐఐటీ విద్యార్థుల్లో 60 శాతం మంది మాత్రమే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు పొందినట్టు టీమ్ లీజ్ వెల్లడించింది. ఎన్ఐటీలు, ఇతర ప్రఖ్యాత ఇంజినీరింగ్ యూనివర్సిటీలు, కళాశాలల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 60 శాతం మందికి కూడా ఉద్యోగాలు లభించలేదని పేర్కొన్నది.

డిమాండ్ ఉన్నా స్కిల్స్ లేవు

ఇంజినీరింగ్ పూర్తి చేసే వారికి డిమాండ్ ఉన్నప్పటికీ నైపుణ్యాలు లేకపోవడమే అసలు సమస్య. కృత్రిమ మేధ(ఏఐ), విద్యుత్ వాహనాలు, సెమికండక్టర్ల తయారీ వంటి కొత్త రంగాలకు ప్రాముఖ్యం పెరగడంతో ఈ అంశాల్లో నైపుణ్యాలు ఉన్న పట్టభద్రులకు డిమాండ్ పెరుగుతున్నది. మరోవైపు మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీపై నైపుణ్యాలు ఉన్న వారి అవసరం కూడా పరిశ్రమలకు పెరుగుతున్నది. ఏఐ, కొత్త సాంకేతికతల్లో నైపుణ్యాల కొరత భారీగా ఉన్నది. ఈ సాంకేతికతల్లో 25-30% నైపుణ్యాల కొరత ఉన్నట్టు టీమ్ లీజ్ అధ్యయనం పేర్కొన్నది. దేశంలోని ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో 80% మందికి ఈ రంగంలో రాణించే నైపుణ్యాలు లేవని నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. కొత్తగా పుట్టుకొస్తున్న సాంకేతికతలపై ఇంజినీరింగ్ విద్యలో పాఠాలు లేకపోవడం, ప్రాజెక్టు ఆధారిత ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వకపోవడమే ఈ పరిస్థితికి కారణమని నిపుణులు పేర్కొంటున్నారు.

దేశంలో ఈ ఏడాది ఇంజినీరింగ్ పూర్తి చేయనున్న వారు

విభాగం	పట్టభద్రుల సంఖ్య
ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ	8.30 లక్షల మంది
ఐటీ అండ్ కంప్యూటర్	2.68 లక్షల మంది
పీజీ(పై రెండు విభాగాలు)	1.25 లక్షల మంది
పాలిటెక్నిక్(పాస్ ఔట్)	3.29 లక్షల మంది
మొత్తం	15.52 లక్షల మంది

టీమ్ లీజ్ అంచనా

ఉద్యోగాల్లో నైపుణ్యాల కొరత

విభాగం	శాతం
ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో ఉపాధి రేటు	60 శాతం
పరిశ్రమ ప్రమాణాలను అందుకుంటున్న వారు	45 శాతం
ఏఐ, కొత్త సాంకేతికతల్లో నైపుణ్యాల కొరత	25-30 శాతం
ఉపాధి పొందే అవకాశం ఉన్న వారు(2024)	10-15 శాతం

టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్లేస్‌మెంట్స్ ఇలా..

సంస్థ	ప్లేస్‌మెంట్స్ శాతం (2024)
ఐఐటీలు	60%
ఎన్ఐటీలు, ఇతర సంస్థలు	60 శాతం లోపే

2028లో లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన

మొదటిపేజీ తరువాయి...

దేశంలో అన్ని కులాల జనాభాను లెక్కించేందుకు జనగణనతో పాటు కుల గణన సైతం చేపట్టనున్నారా అనే విషయమై ఇంకా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని తెలుస్తున్నది.

2026లోనే పునర్విభజన చేపట్టాల్సి ఉన్నా..

జనగణన పూర్తయిన తర్వాత లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని, 2028 నాటికి ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. అయితే, కొత్త జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాల లోక్ సభ స్థానాల సంఖ్యను నిర్ణయిస్తారా అనేది తేలాల్సి ఉంది. ఇలా చేస్తే దేశ ప్రయోజనాల దృష్ట్యా జనాభా నియంత్రణ పద్ధతులను సమర్థంగా పాటిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఇక్కడ సీట్ల సంఖ్య తగ్గిపోయి ఉత్తరాది రాష్ట్రాల్లో గణనీయంగా పెరుగుతుందని ఇప్పటికే ఇక్కడి నేతలు వాపోతున్న సంగతి తెలిసిందే. వాస్తవానికి 2026లోనే నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉన్నప్పటికీ, 2029లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల ముందు పునర్విభజన చేపట్టాలని కేంద్రం నిర్ణయించటం గమనార్హం.

కులగణనపై స్పష్టత ఇవ్వండి: కాంగ్రెస్

జనగణనలో భాగంగా అన్ని కులగణన కూడా చేస్తారా అనేది స్పష్టత ఇవ్వాలని, ఇందుకు గానూ అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. 'రెండు కీలక అంశాలపై స్పష్టత రాలేదు. ఎస్సీ, ఎస్టీ జనాభా సంఖ్యను గుర్తించడంతో పాటు అన్ని కులాల సంఖ్యను కూడా లెక్కిస్తారా? జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాల లోక్‌సభ సీట్ల సంఖ్యను నిర్ణయిస్తారా?' అని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ ప్రశ్నించారు.

మారనున్న జనగణన సైకిల్

దేశంలో తొలిసారి 1872లో జనగణన జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1951 నుంచి ప్రతి పదేండ్లకు ఒకసారి జనగణన జరుగుతున్నది. చివరగా 2011లో నిర్వహించారు. 2021లో జనాభా లెక్కల సేకరణ జరగాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఎట్టకేలకు ఈ ప్రక్రియ వచ్చే ఏడాది ప్రారంభం కానున్నది. అయితే, ఇక నుంచి జనగణన సైకిల్‌ను కూడా మార్చనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. వచ్చేసారి జనాభా లెక్కింపు 2035, ఆ తర్వాత 2045లో జరుగుతుందని, భవిష్యత్తులో ఇలానే ప్రతి పదేండ్లకు ఒకసారి చేపట్టనున్నట్టు వెల్లడించాయి.

దేశంలోనే తొలి ప్రైవేట్ మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ కేంద్రం ప్రారంభం

- గుజరాత్‌లో టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ ప్రారంభించిన ప్రధాని

వడోదర: గుజరాత్‌లోని వడోదరలో నిర్మించిన టాటా ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాంగణాన్ని ప్రధాని మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ సోమవారం ప్రారంభించారు. ఈ పరిశ్రమలో సీ295 ఎయిర్‌క్రాఫ్ట్‌లను తయారుచేస్తారు. ఇవి భారత్‌లో తొలి ప్రైవేట్ మిలిటరీ విమానాలు. ఈ ఎయిర్‌బస్ సీ295 మధ్య శ్రేణి సైనిక రవాణా విమానాలను ప్రారంభంలో స్పెయిన్ సంస్థ కాసా డిజైన్ చేసి రూపొందిస్తుంది. సీ295 కార్యక్రమం కింద 56 విమానాలను స్పెయిన్ కంపెనీ ఎయిర్ బస్ స్పెయిన్‌లో తయారు చేస్తుంది. మిగిలిన 40 విమానాలను భారత్‌లోని టాటా సంస్థ తయారు చేస్తుంది.

కెనడాలో అంతర్జాతీయ విద్యార్థులకు షాక్

- ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఉచిత ఆహారం ఇవ్వరాదని ఓ ఫుడ్ బ్యాంక్ నిర్ణయం
- భారతీయ విద్యార్థులపై ప్రభావం

న్యూఢిల్లీ : కెనడాలోని వాంకోవర్‌లో ఉన్న ఓ ఫుడ్ బ్యాంక్ అంతర్జాతీయ విద్యార్థులకు షాక్ ఇచ్చింది. కళాశాలల్లో మొదటి సంవత్సరం చదువుతున్న విదేశీ విద్యార్థులకు ఉచిత ఆహారాన్ని అందించరాదని ది గ్రేటర్ వాంకోవర్ ఫుడ్ బ్యాంక్ నిర్ణయించింది. ఆహారం ధరలు, నిరుద్యోగం పెరిగిపోతుండటంతో, ఉచిత ఆహారం కోసం వస్తున్నవారి సంఖ్య విపరీతంగా పెరిగిపోతున్నదని తెలిపింది. దీంతో ఈ బ్యాంక్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నిర్ణయం వల్ల ముఖ్యంగా భారతీయ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారు. కెనడాలోని అంతర్జాతీయ విద్యార్థుల్లో అత్యధికులు భారతీయులేనేనే సంగతి తెలిసిందే. కెనడాలో జీవన వ్యయం రికార్డు స్థాయిలో పెరిగింది. దీంతో ప్రజలు ఉచిత ఆహారాన్ని అందించే ఫుడ్ బ్యాంకులపై ఆధారపడుతున్నారు. కెనడా ఫుడ్ బ్యాంక్స్ వార్షిక నివేదిక ప్రకారం, ఈ ఏడాది మార్చి నెలలో 20 లక్షల మందికిపైగా ఉచిత ఆహారం తీసుకున్నారు. 2019 మార్చిలో ఉచిత ఆహారం తీసుకున్నవారి సంఖ్యకు ఇది రెట్టింపు.

కేరళ సీఎం కాన్వాయ్‌కి ప్రమాదం

ఢీకొన్న ఐదు వాహనాలు

తిరువనంతపురం: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కాన్వాయ్ సోమవారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. వాహన శ్రేణిలోని ఐదు కార్లు ఒకదాని వెనుక మరొకటి ఢీకొట్టాయి. పోలీస్ ఎస్కార్ట్ వాహనం, సీఎం కారు, అంబులెన్స్ కూడా ప్రమాదానికి గురైనవాటిలో ఉన్నాయి. తిరువనంతపురం జిల్లా, వామనపురం వద్ద జరిగిన ఈ ప్రమాదం నుంచి సీఎం సహా అంతా సురక్షితంగా బయటపడ్డారు. ఎవరికీ గాయాలు కాలేదు. పినరయి విజయన్ వేరొక వాహనంలో వెళ్లిపోయారు. ఈ ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ వైరల్ అవుతున్నది.

ముడా స్కామ్‌లో వీడియో సాక్ష్యం

- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు అప్పగించిన ఫిర్యాదుదారుడు
- కారులో నోట్ల కట్టలు లెక్కిస్తున్నట్టుగా వీడియో
- ఈడీ కస్టడీకి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సన్నిహితుడు

బెంగళూరు, అక్టోబర్ 28: ముడా స్కామ్‌లో మనీ లాండరింగ్ ఆరోపణలపై విచారణ జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) చేతికి బలమైన సాక్ష్యం అందింది. ఈ స్కామ్‌లో డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలకు బలం చేకూర్చేలా ఉన్న వీడియోను ముడా కుంభకోణంపై ఫిర్యాదుదారుల్లో ఒకరైన ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ ఈడీకి సోమవారం అందజేశారు. ఓ కారు వెనుక సీట్లో నోట్ల కట్టలు లెక్కిస్తున్నట్టుగా, రూ.25 లక్షలు చేతులు మారుతున్నట్టుగా ఈ వీడియో ఉందని ఆయన తెలిపారు. ఈ మేరకు ఈడీ అదనపు డైరెక్టర్‌కు లేఖ రాశారు. ఈ వీడియోపై విచారణ జరపాలని, ఇందులో కనిపించిన వ్యక్తులకు సమన్లు జారీ చేయాలని ఆయన కోరారు.

సీఎం సన్నిహితుడి ఇంట్లో సోదాలు

ముడా స్కామ్‌లో కర్ణాటకలో ఈడీ సోదాలు కొనసాగుతున్నాయి. బెంగళూరు, మైసూరులోని ఏడెనిమిది ప్రాంతాల్లో సోమవారం సోదాలు జరిగాయి. మైసూరులోని సిద్ధరామయ్య సన్నిహితుడు రాకేశ్ పాపన్న ఇంట్లో ఈడీ సోదాలు చేసి పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. అనంతరం ఆయనను కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్నది. బెంగళూరులోని ఓ బిల్డర్ ఇంటితో పాటు మాజీ ముడా కమిషనర్లు జీటీ దినేశ్ కుమార్, డీబీ నటేశ్ ఇండ్లపైనా ఈడీ దాడులు చేసింది. ముడా కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. ఆయన భార్య పార్వతి తక్కువ విలువ కలిగిన భూమిని ముడాకు అప్పగించి, బదులుగా ఖరీదైన 14 స్థలాలను పొందారనే ఆరోపణలతో ఈ కేసు నమోదయ్యింది. ఈ స్కామ్ కర్ణాటకలో రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతున్నది. ముఖ్యమంత్రి పదవి నుంచి సిద్ధరామయ్య తప్పుకోవాలని ప్రతిపక్షాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

'విజయ'ం దక్కేనా?

- తమిళ రాజకీయాల్లో సంచలనంగా విజయ్ పార్టీ
- డీఎంకేకు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు ప్రయత్నం
- అన్నా డీఎంకే స్థానాన్ని భర్తీ చేసేలా రాజకీయ వ్యూహం
- ప్రత్యామ్నాయ సిద్ధాంతంతో రాష్ట్ర ప్రజల ముందుకు..

చెన్నై, అక్టోబర్ 28: తమిళ స్టార్ హీరో విజయ్ ఆదివారం నిర్వహించిన తన పార్టీ మొదటి బహిరంగ సభ తమిళ రాజకీయాల్లో కొత్త చర్చలకు తెరతీసింది. 2026లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా తన తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీని విజయ్ సిద్ధం చేస్తున్నారు. తమిళ రాజకీయాల్లో గత అర్ధ శతాబ్దంగా డీఎంకే, అన్నా డీఎంకే మధ్యనే పోటీ కొనసాగుతూ వచ్చింది. అయితే, జయలలిత మరణంతో అన్నా డీఎంకే పూర్తిగా బలహీన పడింది. బీజేపీతో పాటు పలు చిన్న పార్టీలు డీఎంకేకు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు ప్రయత్నించినా లోక్‌సభ ఎన్నికల్లో వాటి ప్రభావం పెద్దగా కనిపించలేదు. దీంతో ప్రస్తుతం అధికార డీఎంకేను ఎదుర్కొనే ప్రత్యామ్నాయం లేని రాజకీయ శూన్యత తమిళ రాజకీయాల్లో ఉంది. సరిగ్గా ఈ విషయాన్ని గుర్తించిన విజయ్.. డీఎంకేకు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు, అన్నా డీఎంకే స్థానాన్ని భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

మరో ఎంజీఆర్ అవుతారా?

సినీ రంగానికి చెందిన వారిని రాజకీయంగా ఆదరించడం తమిళనాడులో కొత్తేమీ కాదు. ఒకప్పటి ప్రముఖ నటుడు ఎంజీ రామచంద్రన్ సినీ నేపథ్యం నుంచి వచ్చి అన్నా డీఎంకే పార్టీని స్థాపించి విజయవంతమయ్యారు. మాజీ ముఖ్యమంత్రులు కరుణానిధి, జయలలితకు సైతం సినీ నేపథ్యం ఉంది. సినీ ప్రముఖులను ఆదరించడమే కాదు తిరస్కరించిన చరిత్ర కూడా తమిళులకు ఉంది. విజయ్‌కాంత్, కమల్ హాసన్ లాంటి హీరోలు రాజకీయంగా రాణించలేకపోయారు. ఈ నేపథ్యంలో విజయ్ మరో ఎంజీఆర్ అవుతారా? లేదా విజయ్‌కాంత్, కమల్ హాసన్‌లా మిగిలిపోతారా? అనేది మరో 18 నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలు తేల్చేయనున్నాయి.

ప్రత్యామ్నాయ సిద్ధాంతానికి ఆదరణ ఉంటుందా?

తమిళనాడులో దశాబ్దాలుగా ద్రావిడవాద రాజకీయాలే రాజ్యమేలుతున్నాయి. ఈవీ రామస్వామి పెరియార్, అన్నాదురై సిద్ధాంతాలు, ఆశయాల ఆధారంగా పార్టీలు నడుస్తున్నాయి. ఈ విషయంలో విజయ్ కొంత భిన్నమైన సిద్ధాంతాన్ని ఎంచుకున్నారు. తనకు ద్రావిడవాదం, జాతీయవాదం రెండు కళ్ల లాంటివని విజయ్ ప్రకటించారు. పెరియార్, కే కామరాజ్, బీఆర్ అంబేద్కర్ వంటి నాయకుల ఆలోచనలే తనకు స్ఫూర్తి అని చెప్పినప్పటికీ తనది నాస్తికవాదం కాదని విజయ్ స్పష్టం చేశారు. తద్వారా ద్రావిడవాదం, నాస్తికత్వాన్ని నమ్ముకునే డీఎంకేకు, జాతీయవాదం, మతాన్ని నమ్ముకునే బీజేపీకి భిన్నంగా విజయ్ వెళ్తున్నారు. ఈ కొత్త వాదానికి తమిళుల ఆదరణ లభిస్తుందా అనేది చూడాల్సి ఉంది.

కమలకే ఇండియన్ అమెరికన్ల మద్దతు!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి, భారత మూలాలున్న కమలా హారిస్‌కే ఇండియన్ అమెరికన్లు జైకొడుతున్నారు. 61 శాతం మంది ఆమెకు మద్దతు పలుకుతున్నారు. అయితే గత ఎన్నికలతో పోలిస్తే ట్రంప్ షేర్ కూడా పెరుగుతుండడం డెమోక్రాట్లను ఆందోళనకు గురిచేస్తున్నది. అనలిటకల్ సంస్థ యూగవ్‌తో కలిసి కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ నిర్వహించిన '2024 ఇండియన్-అమెరికన్ ఆటిట్యూడ్స్' సర్వేలో ఈ విషయం వెల్లడైంది. అమెరికాలోని రిజిస్టర్డ్ ఇండియన్-అమెరికన్ ఓటర్లలో 61 శాతం మంది కమలాహారిస్‌కు ఓటు వేయనున్నట్టుగా చెప్పగా, 32 శాతం మంది ట్రంప్‌కు జై కొట్టారు. కమలకు మద్దతు ఇచ్చే వారి సంఖ్య ఎక్కువగానే ఉన్నప్పటికీ అదే సమయంలో 2020 ఎన్నికలతో పోలిస్తే ట్రంప్‌కు మద్దతు పెరుగుతున్నట్టు తేలింది. అలాగే, 67 శాతం మంది ఇండియన్-అమెరికన్ మహిళలు హారిస్ వెంట నిలవగా, 53 శాతం మంది పురుషులు హారిస్‌కు ఓటేస్తామని చెప్పారు. అమెరికాలో 5.2 మిలియన్ల మంది భారత సంతతి ప్రజలు నివసిస్తున్నారు. అమెరికా వలసదారుల్లో భారతీయులు రెండోస్థానంలో ఉన్నారు. దీంతో ఇప్పుడు వీరు ఫలితాలను తారుమారు చేయగల స్థితిలో నిలిచారు.

స్వింగ్ స్టేట్స్‌లో కింగ్ ఎవరో?

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఆ 7 రాష్ట్రాలే కీలకం • విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్న ట్రంప్, హారిస్



వాషింగ్టన్, అక్టోబర్ 28: అగ్రరాజ్యం అమెరికాలో మొత్తం 50 రాష్ట్రాలు ఉన్నప్పటికీ అధ్యక్ష ఎన్నికల్లో కొన్ని రాష్ట్రాలు ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. వాటినే 'స్వింగ్ స్టేట్స్' అంటారు. తటస్థ ఓటర్లతో అమెరికా అధ్యక్ష ఎన్నికలను మలుపు తిప్పగలిగే ఈ 'స్వింగ్ స్టేట్స్' జాబితాలో అరిజోనా, జార్జియా, మిషిగన్, నెవడా, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్ ఉన్నాయి. దీంతో ఈసారి స్వింగ్ స్టేట్స్‌ను గెలుచుకునేందుకు డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ సర్వశక్తులు ఒడ్డుతున్నారు. గత ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ ఈ 7 రాష్ట్రాల్లో ఆరింట పైచేయి సాధించి 306-232 ఓట్ల తేడాతో అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకోగా.. ఒక్క నార్త్ కరోలినాలో మాత్రమే ట్రంప్ ఆధిక్యంలో నిలిచారు. ఈ నేపథ్యంలో ఈసారి స్వింగ్ స్టేట్స్‌లో ట్రంప్, హారిస్ మధ్య పోరు హోరాహోరీగా సాగవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. వాస్తవానికి అమెరికాలో చాలా మంది ఓటర్లు ఏ పార్టీకి మద్దతు తెలుపబోతున్నదీ ముందే చెప్పేస్తారు. తద్వారా రిపబ్లికన్లు, డెమోక్రాట్లుగా గుర్తింపు పొందుతారు. దీంతో ఏ రాష్ట్రంలో ఎవరు గెలుస్తారో ముందే తెలిసిపోతుంది. కానీ, స్వింగ్ రాష్ట్రాల ప్రజలు మాత్రం పార్టీల సిద్ధాంతాలకు కట్టుబడకుండా తటస్థంగా ఉంటారు. గుడ్డిగా ఏ పార్టీకీ మద్దతివ్వరు. దీంతో ఈ స్వింగ్ రాష్ట్రాలే అధ్యక్ష ఎన్నికల్లో కీలకంగా మారి ఫలితాలను మార్చేస్తుంటాయి.

అరిజోనా

మెక్సికోతో సుదీర్ఘ సరిహద్దు ఉన్న ఈ రాష్ట్రం చాలా దశాబ్దాల నుంచి రిపబ్లికన్లకు కంచుకోటలా నిలుస్తున్నది. కానీ, ఈసారి అరిజోనాలో లాటిన్ ఓటర్లు పెరగడం, కాలిఫోర్నియా నుంచి చాలా మంది డెమోక్రటిక్ పార్టీ మద్దతుదారులు వలస రావడంతో ప్రస్తుతం అక్కడ పోటీ ఆసక్తికరంగా మారింది. అక్రమ వలసదారులతో తలెత్తుతున్న సమస్యలను అస్త్రంగా మలుచుకునేందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నిస్తుండగా.. వలసలను అరికడతామని కమలా హారిస్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం అరిజోనాలో హారిస్ కంటే ట్రంప్ 2% అధిక్యతలో ఉన్నట్టు సర్వేలు చెప్తున్నాయి.

జార్జియా

1992 నుంచి ఒక్కసారి కూడా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థికి ఓటు వేయని జార్జియా.. 2020లో స్వల్ప తేడాతో బైడెన్ వైపు మొగ్గు చూపింది. దీంతో ఆయన 0.24% ఓట్ల తేడాతో గెలిచారు. ఈ రాష్ట్రంలో ఆఫ్రో-అమెరికన్ (నల్లజాతి) ఓటర్లు 33% మేరకు ఉండటం కమలా హారిస్‌కు కలిసొచ్చే అంశం. గత ఎన్నికల్లో ఈ రాష్ట్రం తీవ్ర వివాదాస్పదంగా మారింది. స్వల్ప మెజార్టీని తన వైపు తిప్పేలా చేయాలని ఎన్నికల అధికారులపై 2020లో ట్రంప్ ఒత్తిడి తెచ్చినట్టు కేసు నమోదైంది. కానీ, ఆ కేసును 2024 ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు వాయిదా వేయడం ట్రంప్‌కు ఊరట కలిగించింది.

మిషిగన్

అరబ్-అమెరికన్లు అధికంగా ఉండే ఈ రాష్ట్రం డెమోక్రాట్లకు బలమైన కేంద్రంగా పేరు పొందింది. గత ఎన్నికల్లోనూ మిషిగన్ ఓటర్లు బైడెన్ వైపు మొగ్గు చూపినప్పటికీ ప్రస్తుతం ఆయనపై అసంతృప్తితో ఉన్నారు. గాజా-పాలస్తీనా విషయంలో ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు ఇవ్వడాన్ని వారు హర్షించడం లేదు. 2016 ఎన్నికల్లో మిషిగన్‌లో పైచేయి సాధించిన ట్రంప్.. ఈసారి కూడా ఆ రికార్డు సృష్టించాలని ఉవ్విళ్లూరుతున్నారు.

నెవాడా

దాదాపు 30 లక్షల మంది ఓటర్లు ఉన